క్లుప్తంగా

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



వంగూరు: మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన ఆలయంలో గురువారం ఆంజనేయస్వామి విగ్రహం, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయంలో హోమం నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రైతు కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్‌పండిత్‌రావు, పలువురు పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల

అచ్చంపేట/అచ్చంపేట రూరల్: పట్టణంలో గురువారం అంబేడ్కర్ 134వ జయంతి ఉత్సవాల కరపత్రాలను మాజీ జెడ్పీటీసీ, సీబీఎం ట్రస్టు చైర్మన్ డాక్టర్ అనురాధ, మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు విడుదల చేశారు. కార్యక్రమంలో పాతుకుల శ్రీశైలం, మాజీ ఎంపీపీ రామనాథం, హరిశ్చంద్ర, లోక్యానాయక్, ఆనంద్, సునీత, రాములు, రాఘవులు, కుంద మల్లికార్జున, రాజ్‌గోపాల్, విజయ్, పర్వతాలు, తిరుమల పరమేశ్వర్, ప్రభాకర్, రాజు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు బైక్ ఢీ: ఇద్దరికి గాయాలు

కల్వకుర్తి రూరల్: మండలంలోని తాండ్ర సమీపంలో గురువారం రాత్రి ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్న ఘటనలో బైక్ పై ప్రయాణిస్తున్న దంపతులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తాండ్ర నుంచి కొండారెడ్డి పల్లి గ్రామం వైపు వెళ్తున్న బైక్‌ను కల్వకుర్తి నుంచి అచ్చంపేట వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొన్నది. బైక్‌పై ప్రయాణిస్తున్న అచ్చంపేట చెందిన అశోక్, ఆయన భార్య గాయపడ్డారు. గాయపడ్డ వారిని 108 వాహనంలో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు చెప్పారు.

బాధిత మహిళకు పునరావాసం కల్పించాలి

తాడూరు: ఊర్కొండపేటలో గ్యాంగ్ రేప్ బాధితురాలికి పునరావాసం కల్పించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆసంఘం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుండగులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చెన్నయ్య, రాములమ్మ, చిన్నమ్మ, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

అంబలికేంద్రం ప్రారంభం

అచ్చంపేట రూరల్: పట్టణంలోని రక్షిత మహిళా సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని గురువారం సీబీఎం చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్, ఎమ్మెల్యే వంశీకృష్ణ సతీమణి డాక్టర్ అనురాధ ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, సొసైటీ అధ్యక్షురాలు జయమ్మ, మాధవి, లత, రాధిక, కళావతి, అంజలి, మంజుల, వనజ, నాగలక్ష్మి, గిరిజ, సునీత పాల్గొన్నారు.

13న భీమ్ దీక్ష ముగింపు సభ

తెలకపల్లి: రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రంలో ఈ నెల 13న భీమ్‌దీక్షా ముగింపు సభ నిర్వహిస్తున్నట్లు స్వేరో జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ అన్నారు. గురువారం మండలంలోని గౌరెడ్డిపల్లిలో భీమ్‌దీక్ష ముగింపు సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆయన విడుదల చేసి మాట్లాడారు. కార్యకర్తలు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సంపత్, శేఖర్, లక్ష్మణ్, వెంకటేష్, అంజనేయులు, బాలరాజు, బాలకృష్ణ, సత్యం పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీకి చెందిన రాకేష్ సోదరుల వ్యాపార సంస్థలు మూడు రోజుల కిందట అగ్నికి ఆహుతయ్యాయి. రూ.లక్షల నష్టం వాటిల్లింది. దీంతో దిక్కుతోచనిస్థితిలో పడ్డారు. విషయం తెలుసుకున్న మాజీ వైస్ ఎంపీపీ కొండూరు గోవర్ధన్ బాధితులకు రూ.10 వేల ఆర్థికసాయం చేశారు. ఆయన వెంట మాజీ మార్కెట్ చైర్మన్ సింగం విజయ్ గౌడ్ ఉన్నారు.



అర్హులందరికీ సన్నబియ్యం

సాక్షి, నెట్‌వర్క్: అర్హులందరికీ ప్రభుత్వం సన్న బియ్యం అందిస్తోందని కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. గురువారం బిజినేపల్లి మండలం మంగనూర్‌లో సన్నబియ్యం పంపిణీని స్థానిక ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్‌రెడ్డితో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. అదేవిధంగా నాగర్ కర్నూల్ జిల్లాలోని పలు మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బియ్యం పంపిణీ చేశారు. నాగర్‌కర్నూల్ మండలం తూడుకుర్తి, తెలకపల్లి, తాడూరు, తిమ్మాజీపేట, గోరిట గ్రామాల్లో ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి సన్న బియ్యం కార్యక్రమాన్ని ప్రారంభించి పేదలకు అందజేశారు. కొల్లాపూర్‌లో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రమ్యనాగరాజు, వైస్ చైర్‌పర్సన్ మహిమూదాబేగం, కౌన్సిలర్లు నర్సింహారావు, శ్రీదేవి గౌతంగౌడ్, కర్నె అలివేలవాసులు, వెల్దండ మండల కేంద్రంతో పాటు కొట్ర, చెర్కూర్, కుప్పగండ్ల, పోతేపల్లి తదితర గ్రామాల్లో రేషన్‌దుకాణాల్లో లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు సన్నబియ్యం పంపిణీ చేశారు. అదేవిధంగా ఉప్పునుంతల మండల కేంద్రంలో -1,2 రేషన్‌దుకాణాలు, చారకొండ మండలం జూపల్లి, వంగూరు మండలం కొండారెడ్డి పల్లిలో రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి లబ్ధిదారులకు బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి పంపిణీ చేశారు.



బిజినేపల్లి మంగనూర్‌లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి



కొల్లాపూర్‌లో..



చారకొండలో బియ్యం పంపిణీ చేస్తున్న రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి



వెల్దండ మండలం కొట్రలో..

పేదలకు కడుపునిండా భోజనం

కల్వకుర్తి: పేదలు ఏ ఒక్కరు కూడా ఆకలితో ఉండకూడదనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించిందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయతి విజయ్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. బీజేపీ నాయకులు అవాస్తవాలు మానుకోవాలని హితువు పలికారు.

చదువుతో ఉజ్వల భవిష్యత్



నాగర్‌కర్నూల్ క్రైం: చదువుతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ శ్రీరాం ఆర్య అన్నారు. మండలంలోని మంతటిలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థులకు చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ ఫర్ చిల్డ్రన్ స్కీంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. అమ్మాయిలను ఎవరైనా వేధిస్తే షీ టీంకు, చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098కు సమాచారం ఇవ్వాలని కోరారు. హెచ్‌ఎం తిరుపతి రెడ్డి, పారాలీగల్ వలంటీర్ బాలస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

5నుంచి సీతారాముల కల్యాణోత్సవం

కోడేరు: మండల కేంద్రంలో ఈ నెల 5 తేదీ నుంచి 7వ తేదీ వరకు మూడు రోజుల పాటు సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు జగదీశ్వర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డిలు తెలిపారు. 5న గణపతిపూజ, నందిభవాని, నవగ్రహ పూజ, చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామిలకు మహాభిషేకం, 6న గణపతిపూజ, పుణ్యాహవచనం, సీతారాముల కల్యాణోత్సవం, సత్యనారాయణస్వామి వ్రతం, మహామంగళహారతి, 7న సీతారాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించనునట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థి సంఘాల నాయకుల ముందస్తు అరెస్టు



వెల్దండ: హెచ్‌సీయూ విద్యార్థులకు మద్దతుగా గురువారం హైదరాబాద్ తరలివెళ్తున్న ఏబీవీపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో కల్వకుర్తి నగర కార్యదర్శి అక్కి వంశీగౌడు, నాయకులు ఉన్నారు.

సీపీఎం నాయకులు..

నాగర్‌కర్నూల్ రూరల్: హెచ్‌సీయూలో భూముల వేలాన్ని ఆపాలని సీపీఎం, విద్యార్థి సంఘాల నాయకులు చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలివెళ్లకుండా గురువారం పోలీసులు వామపక్ష నాయకులను ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో నాయకులు కొంపల్లి అశోక్, తదితరులు అన్నారు.

కళాశాలలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు



కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు సొంత డబ్బులతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాలు ఏర్పాటు చేశారు. గురువారం నుంచి నెల రోజుల పాటు మధ్యాహ్న భోజనాలు విద్యార్థులకు అందిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్ వెల్లడించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు భోజనాలకు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశ్యంతోనే అధ్యాపకులందరూ కలిసి మధ్యాహ్న భోజనానికి అవసరమైన ఆర్థిక సహకారం అందిస్తున్నారని ఆయన వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటయ్య, అధ్యాపకులు రమేష్‌కుమార్, ఎం.కురుమయ్య, విష్ణు, సోఫీ, శివుడు, కేశవులు, బాలరాజు, బాలు, అనిత, మౌనిక తదితరులు ఉన్నారు.

ఫొటో, వీడియో గ్రాఫర్స్ మండల కమిటీ ఎన్నిక

బల్మూర్: ఫొటో, వీడియో గ్రాఫర్స్ మండల కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా కాత్రావత్ గణేష్, ప్రధాన కార్యదర్శిగా రాజేష్, కోశాధికారిగా ఎండీ రఫీలతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అచ్చంపేట నియోజకవర్గ కమిటీ అధ్యక్షుడు తాటికొండ గిరి, జిల్లా ఉపాధ్యక్షుడు షకీల్, సలేశ్వరం, నారాయణగౌడ్, శక్రునాయక్, ఇట్టి శేఖర్, నాగయ్య, మధుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాలతో సేవాదృక్పథం

కొల్లాపూర్ రూరల్: ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాలతో సేవాదృక్పథం అలవడుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ మార్క్‌పోలోనియస్ అన్నారు. గురువారం మండలంలోని అమరగిరిలో పాలమూరు యూనివర్సిటీ పీజీ సెంటర్ కొల్లాపూర్ ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులకు ఆరోగ్యం, పొదుపు, ప్రభుత్వ పథకాలు, భద్రత మరియు ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్యాంపు అధికారి సంతోష్ కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగరాజు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు సౌమ్య, బీజేపీ నాయకులు భరత్, ఎస్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

రూ.6.06 లక్షలకు మేకల సంత వేలం



చారకొండ: మండలంలోని జూపల్లిలో ప్రతి ఆదివారం నిర్వహించే గొర్రెల, మేకల సంతను 2025-26 సంవత్సరానికి పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక అధికారి, తహసీల్దార్ సునీత, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ ఆధ్వర్యంలో గురువారం వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన ఆరుగురు డీడీలు చెల్లించగా వేలం పాటలో ఐదుగురు హాజరయ్యారు. గ్రామానికి చెందిన సూగూరి రామస్వామి రూ.6.06 లక్షలకు పాటపాడి గొర్రెల, మేకల సంత దక్కించుకున్నాడు. ఒక సంవత్సరం పాటు సంత నిర్వహణ, వసూలు చేస్తారని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేష్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి

కొల్లాపూర్ రూరల్: సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి సాధ్యమని ఏఓ చిన్న ఉస్సేన్ అన్నారు. మండలంలోని ముక్కిడిగుండం, మొలచింతపల్లి గ్రామాల్లో ఆయన వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరిలో కాండం తొలుచు పురుగు ఆశిస్తోందన్నారు. తెల్ల కంకులు ఉన్నట్లు గుర్తించారు. దీని నివారణకు ఎకరాకు క్లోరంత్ర నిలిప్రోల్ 800 మిల్లీ లీటర్లు, ప్రొఫెనోజోల్ 250 మిల్లీ లీటర్లు స్ప్రే చేయాలన్నారు. అలాగే వరిలో మెడ విరుపు తెగులు గమనించడం జరిగిందన్నారు. దీని నివారణకు ప్రొఫెనోజోల్ 200 మిల్లీ లీటర్లు ఎకరానికి స్ప్రే చేయాలన్నారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి మోహన్ కుమార్, రైతులు రవి కుమార్, ప్రణయ్ కుమార్ రెడ్డి, వెంకటయ్యలు పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు



ఆలయంలో మూల విగ్రహాలు

లింగాల: మండల కేంద్రంలోని కోదండరామాలయంలో శుక్రవారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభకానున్నాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని ముస్తాబు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు. నల్లమల ప్రాంత ప్రజలకు ఆరాధ్యదైవమైన సీతారాముల బ్రహ్మోత్సవాలు చైత్ర శుద్ధ సప్తమి మొదలు కొని చైత్ర శుద్ధ బహుళ పాడ్యమి వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పూజారి భాస్కర్ తెలిపారు.

బ్రహ్మోత్సవాల వివరాలు ఇలా..

4న పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, అంకురార్పణ, 5న అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, రాత్రికి ఎదర్కోళ్ల సేవ, 6న మధ్యాహ్నం సీతారాములు కల్యాణం, 7న హోమం, రాత్రి హనుమంతు సేవ, 8న వేదపారాయణం, 9న బలిహరణ, వేద పారాయణం, 10న రాత్రి చిన్న తేరు(పుష్ప రథం), 11న రథ ప్రతిష్ఠ రాత్రికి పెద్ద తేరు(విమాన రథోత్సవం) నిర్వహిస్తునట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అదేవిధంగా 12న భజన, దైవ కార్యక్రమాలు, 13న పూర్ణాహుతి, చక్రతీర్థం, పుష్పయాగం, ఏకాంత సేవ, 13వ తేదీ నుంచి 25 వరకు ప్రత్యేక పూజలు, 25న రాత్రి పొన్న సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.



ఆలయ గాలి గోపురం

విద్యార్థులు ఉన్నత స్థానంలో స్థిరపడాలి

తెలకపల్లి: విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత స్థానంలో స్థిరపడాలని డీఈఓ రమేష్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని రాకొండ కస్తూర్బా బాలికల పాఠశాలలో నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలో తాళ్ళపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని బిందు జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థిని ఆయన సన్మానించారు. హెచ్‌ఎం మల్లేష్, ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి, సెక్టోరల్ అధికారి వెంకటయ్య, మధుసూదన్ రెడ్డి, డీసీ శ్వేతారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకే సంక్షేమ పథకాలు

తిమ్మాజిపేట: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల ప్రత్యేకాధికారి, డీఈఓ రమేష్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ లక్ష్మీదేవి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 14వ తేదీ ఉందన్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు విస్తృత ప్రచారం చేయాలన్నారు. మీసేవలో దరఖాస్తు తర్వాత జిరాక్స్ కాపీలను ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఎంపీఓ రాములు, కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.



తిమ్మాజిపేటలో మాట్లాడుతున్న డీఈఓ రమేష్‌కుమార్

రాజీవ్ యువ వికాసంపై ప్రచారం చేయాలి

ఉప్పునుంతల: రాజీవ్ యువ వికాసం పథకంపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని మండల ప్రత్యేకాధికారి నాగేందర్ సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసంపై గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. పథకం గురించి ప్రతి ఇంటికి సమాచారం వెళ్లే విధంగా గ్రామాల్లో టామ్ టామ్ వేయించాలని చెప్పారు. అదేవిధంగా మీసేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకున్న వారు దరఖాస్తు ప్రతిని ఎంపీడీఓ కార్యాలయలంలో సమర్పించాలని సూచించారు. ఈనెల 14వ తేది చివరి గడువు ఉందని తెలిపారు. ఎంపీడీఓ మోహన్‌లాల్, ఎంపీఓ నారాయణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ కేంద్రం ఏర్పాటు

తాడూరు: రాజీవ్ యువ వికాస దరఖాస్తులను స్వీకరించేందుకు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ అంజనేయులు తెలిపారు. సరైన ధ్రువపత్రాలు చూసుకోవాలని కోరారు. మండల కేంద్రంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

దరఖాస్తు చేసుకోవాలి

ఊర్కొండ: అర్హులైన యువతీ యువకులు రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కృష్ణయ్య పేర్కొన్నారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.4 లక్షల వరకు రుణాలు పొందవచ్చని, సద్వినియోగపరచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓ నరసింహులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్లు పెంచటం అభినందనీయం




కల్వకుర్తి: తెలంగాణ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచటం అభినందనీయమని బీసీ సంఘం నాయకుడు కొమ్మగోని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం ఆయన ఢిల్లీలో బీసీ రిజర్వేషన్ల అమలు కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలో పాల్గొన్నారు. అనంతరం ఆయన రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

నేషనల్ యూత్ అవార్డు అందుకున్న శివ



కల్వకుర్తి రూరల్: పట్టణానికి చెందిన స్వామి వివేకానంద సేవ బృందం అధ్యక్షుడు శివకుమార్ గురువారం సాయంత్రం ఢిల్లీలో పార్లమెంట్‌లో నేషనల్ యూత్ అవార్డును కేంద్ర యువజన, క్రీడా సర్వీసుల శాఖ మంత్రి మన్సూక్ మాండవియా చేతుల మీదుగా అందుకున్నారు. 2022 -23 సంవత్సరానికి గాను దేశవ్యాప్తంగా 12 మంది యువకులకు అందించే ఈ జాతీయస్థాయి పురస్కారంలో కల్వకుర్తికి చెందిన శివకుమార్ ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపిక కావడంపై శివకుమార్‌ను అభినందించారు. అవార్డు ప్రదానోత్సవంలో కేంద్ర సహాయ మంత్రి రక్షఖాడ్సే తదితరులు ఉన్నారు.

మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి



వెల్దండ: మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఏపీఓ ఈశ్వర్‌జీ పేర్కొన్నారు. గురువారం మండలంలోని తిమ్మినోనిపల్లి, రాచూర్, కుప్పగండ్ల తదితర గ్రామాల్లోని నర్సరీలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నర్సరీలల్లో ఇచ్చిన టార్గెట్ ప్రకారం మొక్కలను పెంచి సిద్ధంగా ఉంచాలన్నారు. విత్తనాలు మొలకెత్తకపోతే మరోసారి బెడ్లలో నాటించాలన్నారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా మొక్కలను పెంచాలన్నారు. వేసవి కావడంతో ప్రతి నర్సరీకి గ్రీన్‌నెట్ ఏర్పాటు చేసి ఎండతీవ్రత నుంచి మొక్కలను కాపాడాలన్నారు. అనంతరం జాతీయ ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఫీల్డ్‌అసిస్టెంట్లు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

చిన్నారులకు ఆర్థికసాయం

పెద్దకొత్తపల్లి: ఇటీవల తల్లిదండ్రులు కోల్పోయిన చిన్నారులకు కేంద్ర ప్రభుత్వ వాత్సల్య పథకం ద్వారా రూ.4 వేలు మంజూరయ్యారు. ఈ మేరకు గురువారం బీజేపీ నాయకుడు భీమేశ్వర్‌రెడ్డి చిన్నారులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో మధు, శ్రీను, శివ, కృష్ణ, లింగస్వామి, శంకర్, నరేష్, శివాజి, మల్లాజి పాల్గొన్నారు.

పెద్దపల్లిలో చైన్‌స్నాచింగ్

తెలకపల్లి: మండలంలోని పెద్దపల్లిలో చైన్‌స్నాచింగ్ ఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం రెండు రోజుల కిందట మండలంలోని పెద్దపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు తుముల వెంకటమ్మ అదే గ్రామంలో ఉన్న మనమరాలు ఇంటికి వెళ్లింది. ఈ నెల 2న మధ్యాహ్నం మనుమరాలు ఇంటి నుంచి వృద్ధురాలు సొంత ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో శ్మశాన వాటిక దగ్గర గుర్తు తెలియని దుండగులు కారులో వచ్చి వృద్ధురాలి మెడలో ఉన్న తులంపైన బంగారు గొలుసును చైన్‌స్నాచింగ్ చేసి పారిపోయారు. బాధితురాలి గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

పిడుగుపడి పాక్షికంగా దెబ్బతిన్న ఇల్లు

కోడేరు: మండలంలోని నర్సాయిపల్లిలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రావడంతో కుందేళ్ల తిరుపతయ్య ఇంటిపై పిడుగు పడి ఇంటిపై కుమ్మి పాక్షికంగా దెబ్బతిన్నది. చుట్టు పక్కల, బయట ఎవరు లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు బాధితుడు తెలిపారు. అకస్మాత్తుగా పిడుగుపడటంతో చుట్టు పక్కల వారు భయాందోళనకు గురయ్యారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలుశిక్ష

వంగూరు: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ ముగ్గురికి కల్వకుర్తి కోర్టు రెండు రోజులపాటు జైలుశిక్ష విధించిందని ఎస్ఐ మహేందర్ తెలిపారు. మండల పరిధిలోని శ్రీశైలం క్రాస్‌రోడ్డు వద్ద కిరణ్‌కుమార్, రామస్వామి, అంజనేయులు డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డారు. ఈ మేరకు గురువారం వారిని కల్వకుర్తి కోర్టులో హాజరుపర్చగా శిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: వ్యక్తి అదృశ్యమైన ఘటనలో గురువారం కేసు నమోదైనట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నర్సాయిపల్లికి చెందిన రవీందర్ ఊర్కొండపేటలో కోళ్ల ఫాం సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 1న డ్యూటీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలువలేదు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సన్నబియ్యం సంచుల్లో దొడ్డుబియ్యం

వెల్దండ: మండల కేంద్రంలోని రేషన్ షాపు- 2లో సన్నబియ్యం సంచుల్లో దొడ్డుబియ్యం దర్శనమివ్వడంతో డీలర్లు, లబ్ధిదారులు అవాక్కయ్యారు. గురువారం కాంగ్రెస్ నాయకులు సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించడంతో డీలర్ బికుమాండ్ల శ్రీనివాసులు లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తుండగా సంచుల్లో సన్నబియ్యం బదులు దొడ్డుబియ్యం కన్పించాయి. దీంతో లబ్ధిదారులు ఆందోళన చేశారు. కొన్ని సంచుల్లో మాత్రమే దొడ్డు బియ్యం సరఫరా అయ్యినట్లు గుర్తించారు. చివరకు లబ్ధిదారులకు సన్నబియ్యం మాత్రమే బియ్యం పంపిణీ చేశారు. తిరిగి ప్రభుత్వానికి దొడ్డుబియ్యాన్ని అప్పగిస్తామని డీలర్ తెలిపారు.

నాయకుల అరెస్టు

కొల్లాపూర్: పట్టణంలో విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. హెచ్‌సీయూ భూముల వేలానికి సంబంధించి ఆందోళనలు చేస్తారనే కారణంగా బీఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి బి.దాసు, బీఆర్‌ఎస్‌వీ జిల్లా నాయకులు ధార శేఖర్‌లను పోలీసులు గురువారం అరెస్టు చేసి సొంతపూచీకత్తుపై విడుదల చేశారు.